# మట్టిబొమ్మ

శ్రీ ఆకుండి రాజేశ్వరరావు

నోరార అతనిని పేరున పిలచేవారెవ్వరు లేరు. ఉన్న కొద్దిమంది మిత్రులకూ, అతను తనంతట తానుగా దూరమయ్యాడు. ఇక ఎవరిక్కావాలి అతని సంగతి ?—

అందుకే కొంతకాలానికి తన పేరు కూడా తాను మరిచి పోయే స్థితికి వచ్చా డతను. అయినా అతని పేరు మహీపతి.

కొంత అందాన్ని, కొన్ని ఆశల్ని మూట కట్టుకుని, శేషించిన వాటిని గూడా అందుకోవడంకోసం పరుగెత్తే వాళ్లంతా, పరుగెత్తే శక్తిలేక, చతికిలపడ్డ మహీపతిని చూసి నవ్వుకుంటూంటే, నీరునిండిన కళ్లతో దిగులుగా వారిని చూడలేక తల వంచేసుకునేవాడు.

జీవితం చీకటిని ప్రసాదించి, వెలుగును దాచేసుకుంది. ముప్పది సంవత్సరాల జీవితపు పరుగులో, ఒక్క అమృతపు చినుకు గూడా చిందని మహీపతి జీవితంలో యిక శక్తి, ఆసక్తి ఎక్కడిది ? యింకా ఏ ఆశతో లేని ఉత్సాహం తెచ్చుకుని పరుగెత్తగలడు ? గతాన్ని తలచుకోకుండా, వర్తమానాన్ని నిందించకుండా, భవిష్యత్తును ఉజ్వలంగా చేసుకోవాలని లేకపోలేదు. అందుకు ప్రయత్నించక పోలేదు. కాని అతని ప్రతి ప్రయత్నము మరింత నిరాశనే అందిస్తూ వచ్చింది.

అందుకే ఒకరకమైన విరక్తితో దొరికినదారి వెంబడి జీవితయాత్ర సాగింప నారంభించాడు. ఎందుకో—ఎక్కడికో—తెలియదు. అది కాంతి రహిత హేమంత నీరవ నిశీథయాత్ర.

అన్ని ముళ్ళు హృదయంనిండా గుచ్చుకొని, రక్తధారలు స్రవిస్తున్నా, విధి గీసిన వక్రరేఖల నడుమ, నిరాశాఘర్మజలం ఏరులుగా ప్రవహిస్తున్నా—ఏదో ఒక మజిలీ దగ్గర సుఖం, శాంతి లభిస్తాయనే వెర్రి ఆశ అతని హృదయపు పొరల అడుగున కొట్టుకుంటూ ఉండాలి—మరి, లేకపోతే విధి విసిరిన వెర్రి నీడలాంటి మహీపతి యింకా తన జీవితయాత్ర కొనసాగించలేడు.

అలా మహీపతి అనేకచోట్ల తిరుగుతూ, ఒక నగరం చేరుకున్నాడు. పగలంతా ప్రతి వీథి తిరిగాడు. కనుపించిన ప్రతి సైను బోర్డు చదువుకున్నాడు. ఇంతలో పగపట్టిన పగలు జరిగి రాత్రికి చోటు యిచ్చేసింది. మహీపతికి యిక వీథులు తిరగడం విసుగెత్తింది. పట్టణ వాతావరణాన్ని, రిక్షాల మోతనూ వదిలేసి—దూరంగా పారుతూన్న ఏటి ఒడ్డుకు చేరుకున్నాడు.

యుగ యుగాలుగా నిదురలేక ప్రవహిస్తున్న ఏరు అలసి నిదురపోతూంది. అవ్యక్తమైన ఆలోచనలు కృంగదీస్తూంటే యిసుకదిబ్బపై కూలబడ్డాడు.

దూరాన మానవత్వం కోల్పోయిన నగరం నుంచి అలజడిని మోసుకువచ్చిన గాలి అతని ఆలోచనను చెదరగొట్టడానికి యత్నిస్తూనే ఉంది. మరొకవంక చలి అతనిని కొరుకుతూనే ఉంది. పగలంతా అన్ని వీథులు తిరిగినా, ఒక్కరూ పలకరించకపోతే పోయె—తన ఉనికినైనా గమనించకపోవడం జ్ఞప్తికి వచ్చి, "ఎందుకనో !—మానవులంతా మానవత్వం నుంచి దిగజారుతున్నారు" అని తనలో తనే అనుకున్నాడు మహీపతి.

ఇంతలో మబ్బుల పరిష్వంగం నుంచి తప్పించుకు వచ్చిన చంద్రుడు మహీపతిని చూసి పరిహాసంగా ఒక్కసారి నవ్వాడు. మహీపతి కూడా ఊరకనే వెలిగిపోతూ, వెకిలి పోకడలు పోతూన్న చంద్రుని చూసి మెల్లగా నవ్వుకున్నాడు.

ఆ పండువెన్నెల వేడి అతని పేద గుండెను ఉక్కిరిబిక్కిరి చేసింది. "ఇంతకన్నా మండుటెండ నయం" అని అనుకుంటూ, చుట్టూ ఒకసారి చూసి, చెట్టుక్రింది చీకటిలోకి నడిచి చిన్న రాతిపై కూర్చున్నాడు. అతని కెదురుగా యిసుకలోని ప్రతి అణువు వెన్నెలను దాచేసుకుందికి తంటాలు పడుతూంది. తమస్సులో చతికిలబడిన మహీపతి వెన్నెలను చూడలేక కళ్ళు మూసుకుంటే బాగుండు ననుకున్నాడు. ఎందుకో చీకటిలో వెలుగు—వెలుగులో చీకటి కూడా ఉంటాయి కాబోలుననిపించింది. క్రమంగా అతని ఊహలు అతని అదుపు తప్పించుకుని అంబరాని కెగసి ఈ లోకపు అగాధాలను చూడసాగాయి.

"మానవుల వాంఛలు అపరిమితం—కాని జీవితం మాత్రం పరిమిత మైనది. ఈ మితమైన జీవితంలో ఎందుకిన్ని వ్యామోహాలు ? గభీర నిరాశోదరంలో, భరింపరాని అంధకారంలో, తెరిపిలేని కన్నీటి తెరలలో తడుస్తూ మరణోన్ముఖంగా సాగిపోతున్న యీ జీవితంపై అంతులేని మమకారం దేనికి ? కొందరు దుఃఖించడానికే జన్మించారా ? వారి దుఃఖాలకు కారణం ఏది ? వర్తమాన సామాజిక పరిస్థితులలో, బలహీనమైన పరిసరంలో పెరిగిన వారి అంతర్యమా—లేక వారి కర్మా ? వీటిలో ఏది బాధ్యత వహించేది ? స్వప్నసాగర స్నానసాదృశ్యమైన యీ జీవితంలో అన్ని అలల తాకిడికి తట్టుకుని నిలచినా చివరకు మిగిలే దేమిటి ?"

ఒక్కదానికీ అర్థం అవగతం కాలేదు. అయినా మహీపతి ఆలోచిస్తూనే ఉన్నాడు.

# మట్టిబొమ్మ

ఇంతలో చిరుగాజుల మోత పువ్వులాంటి చిన్న నవ్వు వింతగా కలిసి మహీపతి సుషుప్తావస్థను చెదరగొట్టాయి. ఆ నవ్వుని మధుర ధ్వనికి అంత బరువూ, బలమూ ఎలా వచ్చాయో ! ఎవరికి తెలుసు ?

కళ్ళు తెరచి మహీపతి చూసేసరికి—ఆకృతి దాల్చిన అనంత తేజోరాశిలా ఒకామె నిలబడి ఉంది.

తన కన్నులను తనే నమ్మలేక పోయాడు. స్వప్న భ్రాంతి అనుకున్నాడు. కాని మరల వినుపించిన ఆమె నవ్వుతో ఆ భ్రాంతి సడలిపోయింది.

ఆమె సౌందర్యానికి నిశ్చేష్టుడై రెప్ప వాల్చకుండా చూస్తూ "ఎవ రీమె? యీ నిశ్శబ్ద నిర్జన స్థలంలో ఎలా అవతరించింది ?

అబ్బ !— .... ఎంత అందం !

అది ఆమె స్వప్నగానంలోని మౌనమైన మధురశ్రుతి.

చందమామలోని వెలుగు మట్టిలో అమృతం పోసి తడిపి ముద్దగా చేసి ఆ మట్టితో ఈమెను తీర్చిదిద్ది యీ లోకానికి ఒక వరంగా పంపించిఉంటాడు విధాత, లేకపోతే యింత గొప్ప సౌందర్యం ఎలా ఆకృతిని ధరిస్తుంది ?" అనుకున్నాడు మహీపతి.

కదిలీ కదలని మందారాల్లాంటి పెదిమలు.

సృష్టి నైర్మల్యాన్నంతా పొదివికొన్న విశాల నయనాలు.

ముత్యాలూ, కర్పూరం కలిపి విరజిమ్మినట్లున్న చిరు నవ్వు. చూస్తూ తన్ను తాను మరచిపోయాడు మహీపతి. ఆ పారవశ్యంలో అతని కండ్లనుండి ఆనందస్రవంతి కన్నీరుగా జారింది.

ఆమె మెల్లగా అతని చెంత జేరి పాదాల వద్దకూర్చుని, ఆప్యాయంగా కన్నీరు తుడిచింది. ఆ లాలనతో—గట్లు తెంచుకుని, సంవత్సరాలుగా అతడు అణుచుకున్న ఆవేదనంతా ఒక్కసారి పొంగి పొర్లింది.

ఆ పవిత్ర స్పర్శలో ఎంత జీవం ఉందని—ఒక్కసారి దానితో అనూహ్యమైన చైతన్యస్రవంతి పరుగుతీసింది.

తరువాతి మహీపతి ఆమెవైపు పిచ్చిగా చూస్తూ, తన కన్నీటితో మలినమైన పాలరాతివంటి ఆమె చేతులను చూస్తూ,

"ఎంత చల్లని చేతులు ! ఈ హస్తస్పర్శ కోసమే కాబోలు యుగయుగాలుగా తపిస్తున్నాను అనుకున్నాడు".

"రా .... అలా .... అక్కడ కూర్చుందాం" అంటూ వెన్నెలను చూపించింది ఆమె.

ఇరువురూ లేచి .... శాంతి, సౌందర్యం ఒకదాని కొకటి తోడుగా విశ్రాంతి తీసుకుంటూన్న వెన్నెల్లోకి నడిచారు.

ఆమె సౌందర్యపు బరువును తట్టుకునేందుకు విపరీతమైన శక్తి కావాలి. అందుకే మహీపతి అంతర్యం గోల పెడుతున్నా ఆమెను తాకేందుకు భయపడుతూ కూర్చున్నాడు.

ఆమె మౌనంగా యిసుకలో గూడు కడ్తూంది. అప్పుడప్పుడు మహీపతికేసి చూసి చిరునవ్వు నవ్వుతున్నది.

ఎట్టకేలకు ఎండిన పెదిమిలకు అందిన కొత్త తీపిని తడుముకుంటూ, "ఎవరు నువ్వు ?" అన్నాడు.

"ఇష్టపడితే నీదాననే అవుతాను" అన్నది యిసక గూడుకు తుది రూపును దిద్దుతూ—కాదు .... అక్షరాలా ఆమె అలా అనలేదు కాని ఆమె కన్నుల వెన్నెలలు, ముఖంలో తొంగిచూసిన తొలి సిగ్గు, అధరాల కదలిక—అన్నీ కలిసి ఆ భావాన్నే పలికాయి. ఆ సాంకేతిక భాష మహీపతికి అర్థమయింది. అతనిని వరించిన అదృష్టంలో అది మొదటిది.

మహీపతి ఆమెను తన హృదయానికి దగ్గరగా తీసుకోబోయాడు. "ఊఁ—పెంకెతనం" అంటూ అతనికి అందకుండా తప్పించుకుని నీటి ఒడ్డున ఉన్న బండరాతి వైపు పరుగెత్తింది.

మహీపతి కూడా ఆమె ననుసరించాడు.

చలించే చిత్రాల, ఆకృతుల నడుమ వెలుగునీడలు త్రుటికాలం ఆటలాడుకున్నాయి.

ఆమె రాతిపై వయ్యారంగా కూర్చుని, ఏటి నీటిలో కాళ్ళు పడేసి గలగల లాడించింది. సుప్తవాహినిలో తీయని గలగలలు సాగాయి. నిదురనుంచి లేచిన ఏరు ఉరకలు వేయ సాగింది. యింతవరకు మహీపతిని వేధించిన వెన్నెల అతని బందీ అయింది. మలయసమీరం అతనిలోని నిరాశను దిగంతాలకు కొనిపోయి విడిచేసింది. మహీపతికి యీ లోకమే కొత్తగా కనిపించసాగింది.

"నా దానవే కదూ?" అన్నాడు మహీపతి.

"అంత అదృష్టం లభిస్తే యింక నేను కోరే దేమీ లేదు" అని అంటూ ఆమె మహీపతి పాదాలకు నమస్కరించింది.

కండ్లనుండి రెండు ఆనంద బాష్పాలు, సిగలోనుంచి నాలుగు మల్లెపూవులు కూడా ఆమె నమస్కారంతోపాటు మహీపతి పాదాలమీద పడ్డాయి.

మహీపతి ఆమెను లేవనెత్తి, కురులను సవరిస్తూ "యింతకాలం ఎక్కడ దాగిఉన్నట్టు?" అన్నాడు.

"నీ కోసమే అవనీ, ఆకాశము గాలిస్తున్నాను" అన్న దామె. అతను తృప్తిగా నవ్వుకున్నాడు.

ఎక్కడో జనించిన రెండు తెలి మబ్బులు నీలాకాశంలో పెనవైచుకు పోయాయి. రెండు సంతప్త హృదయాలు వింతగా శాంతిపొంది ఒకటిగా కలిసిపోయాయి. ఆశోపహతు లిరువురూ ఆశతో ఒక కొత్త జీవితానికి ప్రారంభోత్సవం

జరుపుకున్నారు. అది వారిరువురి జీవితాల్లోనూ మరువరాని పవిత్రదినం.

మహీపతి జీవితంలో యిదొక కొత్త మలుపు. ఆమె ఎవరో అతనికి తెలియదు. కనీసం ఆమె గత చరిత్ర కూడా తెలుసుకుందామనే ఆసక్తి లేకుండానే, ఆమెతో కలిసి జీవించడానికి నిర్ణయించుకున్నాడంటే — అది తొందరపాటు కాదు. అతని మానసిక పరిస్థితి, ఆమె సౌజన్యం, చూపించిన జాలి—అన్నీ అంత తొందరగా అతనొక నిర్ణయానికి రావడానికి ఆధారము లయ్యాయి. అంతేకాదు. ఆమె సౌందర్యం అతని జీవిత గమనాన్ని అడ్డగించి, బలీయంగా తనవైపు లాగుకుంది. ఆ ఆకర్షణకు లోబడటం అత్యంత సహజం.

ఆమెపేరు జ్యోతిష్మతి. సంపన్న గృహంలో జన్మించింది. అల్లారు ముద్దుగా పెరిగింది. ఎక్కువగా కాకపోయినా యీ లోకాన్ని అర్థం చేసుకునేందుకు అవసరమైన జ్ఞానం పొందేవరకు చదువుకుంది. జ్యోతిష్మతికి చిన్నప్పటి నుంచి బొమ్మలంటే ముచ్చ టెక్కువ. ఆ సరదాయే పదేండ్ల బాలికకు రంగులతో బొమ్మలు వేయాలనే ఆసక్తి కలిగించింది. కనీసం తిండిమీదనైనా ధ్యాస లేకుండా ఎల్లప్పుడూ కుంచెలతో తన లేత మనస్సులోని భావాలను—బొమ్మల్లో దిద్దడానికి తాపత్రయ పడేది. తను గీసిన బొమ్మలను అనేక కోణాల్లోనుంచి చూస్తూ, తన సృష్టికి తానే మురిసి పోయేది. ఒక్కొక్కనాడు తన మదిలో చిత్రించుకొన్న రూపాన్ని—డ్రాయింగు పేపరుపై చిత్రించటం చాతకాక—తన అసమర్థతకు తానే విలపించేది. పరుగెత్తే మబ్బులు, నురగలు కక్కుతూ ఘోషించే సముద్రం, బారులుగా సాగే పక్షులు—మంచుతడి ఆరని పారిజాతాలు—చక్కని గడ్డిపోచ చివర విలాసంగా నాట్యంచేసే మంచుతునక—మహోన్నతంగా నిలిచిన వేణుగోపాలస్వామి ఆలయం గాలిగోపురం—. ఇవన్నీ జ్యోతిష్మతి లేత మనస్సును ఉత్తేజ పరిచేవి. అలా ప్రకృతి సౌందర్యాన్ని అవలోకిస్తూ తన్ను తాను మరచిపోయేది.

వినాయకచవితికి, ఏకదంతుని ప్రతిమ బంకమట్టితో తయారుచేసింది జ్యోతిష్మతి. ఆ విగ్రహం చూచినవారంతా, జ్యోతిష్మతిని అంబరాని కెత్తేశారు. అందరిలోనూ, ప్రసిద్ధ శిల్పి, చిత్రకారుడూ అయిన సంపత్కుమారరావు కూడా మిక్కిలి ప్రశంసించడం జ్యోతిష్మతికి కొంత గర్వకారణమయింది. క్రమంగా ఆమె దృష్టి బొమ్మలు రాయడం మీదనుంచి, బొమ్మలు చేయడం వైపు మరలింది. సంపత్కుమారరావు కూడా వారానికి ఒక్కరోజైనా తప్పకుండా వచ్చి—జ్యోతిష్మతికి విభిన్న శిల్పరీతులు, మెలకువలు వివరిస్తూ ఆమె కృషిని కొనియాడుతూ ప్రోత్సహించేవాడు. ఎన్నో జన్మల సంచిత సంస్కారం ఒక్కసారి మేల్కొని ఆమెను చేరుకుంది. ఎన్నో శిల్పరీతులు తమంతట తాముగా ఆమెలో తావు చేసుకున్నాయి — కొన్ని సంవత్సరాలు జ్యోతిష్మతి బైట ప్రపంచంతో సంబంధం లేకుండా కళా సాధనలో మునిగిపోయింది. మృణ్మయ మూర్తులను మలచడంలో ఒక విశిష్టమైన ప్రమాణాన్ని సాధించడంతోపాటు—తనదీ అనే ఒక ముద్ర కూడా తాను నిర్మించిన ప్రతిమూర్తిమీద వేసుకో గలిగింది. సహృదయుడైన సంపత్కుమారరావు, సూచనలతోనూ, ప్రోత్సాహంతోనూ, తానీ అభివృద్ధి సాధించడం జరిగిందని జ్యోతిష్మతి ఏనాడూ మరచిపోలేదు. సంపత్కుమారరా వామెకు—గురువు—స్నేహితుడే కాదు, సర్వస్వం అతనే.—

అతని సన్నిధిలో ఆమె ప్రపంచాన్నే మరిచేది. ఆమెకు తెలియకుండానే ఆమె ఆంతర్యం అతని పాదాలకు అంకితమయ్యింది. నిరంతరం దేనికోసమో, అన్వేషిస్తున్నట్టు—గంభీరంగా ఉండే—కళాతపస్వి సంపత్కుమారరావు నిర్మల హృదయాన్ని జ్యోతిష్మతి ఆరాధించడంలో అనుచిత మేమీ లేదు. అప్పటికప్పుడే వసంతంలాంటి యౌవనం ఆమెపైన వాలింది. ఆమెలో తెలిసీ తెలియని కోర్కెలు ఒక రూపాన్ని దిద్దుకోసాగాయి. రోజురోజు కొక కొత్త ఆకును వేసు కుంటూ, ఒక వింత అందాన్ని పొదువుకుంటూ—ఆమె తనూలత సంపత్కుమారరావు చుట్టూ అల్లుకోసాగింది.

జాలిలేని కాలం—జ్యోతిష్మతి ఆశను దొంగిలించకుండా ఉంటే— .... కళా ప్రపంచ చరిత్రలో ఆమె కొక ఉన్నతమైన స్థానం లభించి ఉండేది. కాలం—దుమారమై ఆమెకు ఎదురుగా, మహోధృతంగా వీచింది.

హఠాత్తుగా, సంపత్కుమారరావు—కళారంగాన్ని వది లేసి—ఆధ్యాత్మిక రంగంలో ప్రవేశించి యోగసాధనలో మునిగిపోయాడు. జ్యోతిష్మతి అపురూప సౌందర్యం, వేడి కన్నీటి బిందువులు—ఏవీ అతని ఆంతర్యాన్ని మార్చలేకపోయాయి. ఒక్కసారి జ్యోతిష్మతి పాతాళానికి కృంగిపోయింది. ఈ లోకమే శూన్యంగా కనుపించసాగింది.

"యే వా సంస్పర్శజా భోగా"
దుఃఖయోనయ ఏవ తే,
ఆద్యన్త వన్తః కౌన్తేయ !
న తేషు రమతే బుధః."

అని గీతలో పరమాత్మ అర్జునునకు సెలవిచ్చాడు. అది—అంతము కలిగి విషయేంద్రియ సంయోగ జనితమైన సుఖములన్నీ దు:ఖమునకు కారణమే అవుతున్నాయి. ఈనశ్వరమైన సుఖాల్ని నేను వాంఛించటంలేదు. శాశ్వతమైన సుఖాన్ని అందుకునే నా ప్రయత్నానికి అడ్డురాకు అనే సంపత్కుమారరావును—జ్యోతిష్మతి సౌందర్యం ఎంత గొప్పదయినా మట్టుకు ఎలా మరలించగలదు ? అశక్తురాలైన జ్యోతిష్మతి విధిని నిందించుకుంటూ, అతనికి దూరంగా జరిగిపోయింది.

పరవళ్లు తొక్కే యౌవనం—ఏ మగవాడైనా, అర నిముసం ఆమె అందాన్ని పొగిడితే చాలు—అంతా మరిచిపోయి సర్వం అతనికి అర్పించి, అతని చుట్టూ అల్లుకుపోయే ఆంతర్యం—ఆమెను అధోలోకాలకు ఈడ్వసాగాయి. విరాగిణిలా నవ్వుకుంటూ, ఆ భయంక మార్గాన్నే వరించి ప్రయాణం సాగింప నారంభించింది జ్యోతిష్మతి.

# మట్టి బొమ్మ

"ఇంతగా చెడిపోతుందని ఎవరము అనుకోలేదు" అని విచారించారు ఆత్మీయులు.

"స్వైరిణి" అని వ్రేలెత్తి చూపించసాగింది చీకటిలో ఆమె అందాన్ని కోరుతూన్న సమాజం.

తల్లిదండ్రులు ఆమెను నిర్బంధంలో ఉంచారు. జ్యోతిష్మతి అన్ని అనుబంధాలను త్రెంచుకుని, యిల్లు వదిలి పారిపోయింది. విశాల విశ్వాన్నే యిల్లుగా మార్చుకుంది.

జ్యోతిష్మతి అలా ఏ నిర్ణయమూ లేకుండా తిరుగుతూంటే—నాడు మహీపతి ఎదురయ్యాడు.

పెరిగిన గడ్డం, సంస్కార రహితమైన జుత్తుతో వంద మందిలోనున్నా ఒంటరివాడుగా కనుపించే మహీతిని చూసేసరికి జ్యోతిష్మతిలో తెలియని ఆసక్తి జనించింది. ఆమెకు తెలియకుండానే అతన్ని అనుసరించసాగింది జ్యోతిష్మతి. గత జన్మల అనుబంధం బలీయమై, అతనివైపు జ్యోతిష్మతిని తీసుకుపోయి ఉండాలి. లేకపోతే అతని ఒంటరితనం—అతనిలో తొంగిచూసే ఒక విలక్షణత ఆమె ఆంతర్యాన్ని స్పృశించి ఉండాలి. లేనిదే అంత ఆసక్తి అతనిపై జ్యోతిష్మతికి కలగదు.

పండువెన్నెల వదిలేసి—చక్కని చీకటిలో కూర్చున్న మహీపతిని చూడగానే జోతిష్మతి మరీ ఆశ్చర్యపోయింది. ఒక విధమైన జాలి కలిగింది. అదే ఆమెను మహీపతి చెంతకు తీసుకుపోయింది.

ఏమైతేనేం—విధి విచిత్రంగా, జ్యోతిష్మతీ మహీపతులను ఒకటిగా చేసింది.

మహీపతి ఆ చిన్న గదిలో అడుగు పెట్టేసరికల్లా అతన్ని అమితంగా ఆకర్షించినవి – వరుసగా పేర్చిఉన్న మట్టి బొమ్మలూ, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ బొమ్మలున్నూ.

ఆ బొమ్మలను చూస్తూ మహీపతి కూడా బొమ్మగా అయిపోయాడు. కొంతసేపటికి తెప్పరిల్లి, "ఈ చిన్న గదిని యిన్ని బొమ్మలతో అలంకరిస్తావా !" అన్నాడు అమాయకంగా.

ఆమె నవ్వుతూ "అవన్నీ అలంకారానికి కాదు—యీ చిన్ని పొట్టల ఆకలి చల్లారడానికి" అన్నది.

అప్పటికి గాని అర్థమయింది కాదు. ఆమె బొమ్మ లమ్ముకుని జీవిస్తున్నదని— ......

అంతలో జ్యోతిష్మతి "తరువాత తీరుబడిగా చూద్దురు గాని, త్వరగా స్నానానికి లేవండి" అని అంటూ గదికి ఆనుకునిఉన్న వరండా వైపు నడిచింది.

మహీపతి స్నానం చేస్తున్నంతసేపూ, తన జీవితం, ఒక్కసారిగా మారింది. తన కష్ట సుఖాలు పంచుకునే తోడు లభించింది. ఇక వూరకనే తిరక్కూడదు. ఎక్కడైనా ఉద్యోగం సంపాదించి ఆమెను సుఖపెట్టి, తను సుఖపడాలి. ఇలాంటివి ఎన్నో ఊహలు అతని మదిలో మెదిలాయి.

నిన్నటి వరకు జీవితంమీద ఏ ఆశ లేని మహీపతికి జీవించాలనే కోరిక, జీవితంపై మమకారం అన్నీ ఒక్కసారి కలిగాయి. జీవితం దుఃఖసముద్రం కాదు.—ఆనందస్రవంతి—అన్న భావం కలిగింది.

"ఇంకా—స్నానం కాలేదూ !" అన్న జ్యోతిష్మతి కేకతో ఆలోచనల్లోంచి మహీపతి బయటపడి తొందరగా తుడుచుకుని గదిలో పడ్డాడు.

తరువాత యిద్దరూ తీయగా మాట్లాడుకుంటూ వేడి 'టీ' తాగారు.

అనంతరం ఆమె వంటపనిలో మునిగిపోయింది. ఆమె కూర తరుగుతున్నప్పుడూ, పొయ్యి విసురుతున్నప్పుడూ, అన్నం వారుస్తున్నప్పుడు కూడా ఆమె వెనకాలే కొంగు పట్టుకుని తిరగ నారంభించాడు. ఆఖరుకు ఆమె స్నానానికి బయలుదేరేసరికి కూడా ఆమె వెంటపడటానికి సిద్ధమవగా, ఆమె సిగ్గుతో, మిళితమైన చిరునవ్వుతో వరండాకు, గదికి మధ్యగల తలుపును మూసేస్తూ, తన వెనకాలే రాబోతూన్న మహీపతితో "మీ పుణ్య ముంటుంది—రెండు నిముషాలు యిక్కడే ఉండండి—అదిగో! ఆ పుస్తకం కాస్త తిరగేస్తూ కూర్చోండి—" అంటూ తలుపు మూసేసి కిలకిలా నవ్వింది.

అతను కూడా ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ, వరండాలో పడుతున్న నీళ్ల శబ్దాన్ని వింటూ, తుదీ, మొదలు లేని పుస్తకాన్ని తెరచి వూరికే పేజీలు తిప్పసాగాడు. ఒక్క అక్షరం కూడా ఆతనికి కనుపించలేదు.

తీరని విచారంలోనే కాదు—తీయని సంతోషంలో కూడా మానవుడు మనస్సును ఒకచోట నిలుపలేడు కాబోలు!

ఆమె స్నానం చేసుకుని వచ్చే ఆ అయిదు నిముషాలూ, అయిదు యుగాలు అయినట్లుగా బాధపడ్డాడు.

కొత్త రుచుల వంట—జ్యోతిష్మతి కొసరి కొసరి వడ్డన—అవధిలేని వింత అనుభూతిని మహీపతికి కలిగించింది. నిజమైన ఆనందం, శాంతి, తృప్తి ఆనాడు వా రిద్దరి నడుమ కాపురం చేశాయి.

ఆ సమయంలో "జాలి దైవత్వానికి ప్రతిరూపం. నా స్థితికి జాలిపొంది, నన్ను ప్రేమించిన స్త్రీవి. నిన్ను సామాన్య స్త్రీగా చూడటంలేదు. పవిత్రమైన ఆలయంలోని దేవతగా భావిస్తున్నాను" అని సాదరంగా అనకుండా ఉండలేకపోయాడు మహీపతి. అతని ప్రతి మాట తన గుండెలో కూర్చుని అనినట్లు జ్యోతిష్మతి కనిపించింది. మృత సమానమైన ఆమె జీవితంలో కుండలుకొద్దీ అమృతం ఒలికినట్లనిపించింది.

"ఇక ఉద్యోగం కోసం ప్రయత్నించాలి. ఏదైనా ఒక ఉద్యోగ మంటూ దొరికితే—యీ బొమ్మ లమ్ముకునే శ్రమ తప్పుతుంది" అన్నాడు మహీపతి.

ఆ మాటకు జ్యోతిష్మతిలో ఏమాత్రమూ ఆసక్తి కనుపించలేదు, సరికదా— ......

"ఈ బొమ్మ లమ్ముకోవడం, ఉద్యోగం కన్న సిగ్గు పడాలిస పనేమీ కాదులెండి" అన్నది.

"కాని ఒకచోట స్థిరంగా ఉండటానికి వీలు పడదుగా" అని యింకేదో చెప్పబోయి అంతటితోనే ఆగిపోయాడు.

"పది వూళ్లు తిరగడంలో ఉన్న ఆనందం—ఒకేచోట పాతుకుపోవడంలో కనుపించదు. ప్రపంచమంతా మన యిల్లే అవుతుంది—తిరిగితే మాత్రం—ఏం" అన్నది.

ఇక మహీపతికి ఏమనాలో తెలియక అంతటితో ఆ ప్రస్తావన ముగించేశాడు.

క్రమంగా అలసిన మహీపతి జీవితం ఆమె కనురెప్పల నీడలో విశ్రాంతి తీసుకోసాగింది.

బొమ్మలు చాలవరకు అమ్ముడుపోయాయి. ఇక ఉన్నా అమ్మే అవకాశం అంతగా లేదు. మకాం మార్చేశారు.

అలా బొమ్మలమ్ముకుంటూ ఎన్నో పల్లెలు, పట్టణాలు, నదీ నదాలు అధిగమించారు. లోకంలోని వూహలన్నీ మూటలుగాకట్టిన అనురాగ రాగాలాపనలతో—భావవేగంతో వారి ప్రయాణం సాగి పోతూంది.

కొన్ని వాసంత సమీరాలు వారిని లాలించాయి. కొన్ని కొన్ని హేమంత తుషారాలు ఎదిరించి వోడిపోయాయి.

అలా అనంతకాలంవరకు జీవితపు సత్యపు టంచులవరకు యీ మధురయాత్ర సాగిపోతుందనుకున్నాడు మహీపతి.

జ్యోతిష్మతి బొమ్మలు చెయ్యటంలోని మెలకువలను ఎంతో వోపిగ్గా వివరిస్తూ చెప్పేది. కాని మహీపతి ఆమె చెపుతున్నంతసేపూ, ఆమె పెదిమల కదిలికలోని అందాల్ని అంచనా వేస్తూ కూర్చునేవాడు.

"యీ జన్మకు మీకు బొమ్మలు చెయ్యడం అబ్బేదిలేదు." అని అతని ముఖంముందే విసుక్కునేది జ్యోతిష్మతి.

మహీపతి సంతోషంగా నవ్వుకునేవాడు.

మహీపతికి బొమ్మలు చెయ్యడం రాకపోయినా, రంగులు వేయడమైనా అబ్బినందుకు కొంత సంతోషించలేకపోలేదు—జ్యోతిష్మతి.

వర్ణ మిశ్రణంలో ఆమెకు చక్కని ఉపజ్ఞ ఉంది. అప్పుడప్పుడు "మనసుకు రంగేసుకుని, మానవులంతా అందంగా అగుపిస్తున్నారు. అందుకనే రంగులేని మట్టిబొమ్మలు వారిని ఎన్నటికీ ఆకర్షించలేవు" అనేది.

ఆమె నిశిత పరిశీలనా శక్తికి మహీపతి ఆశ్చర్యపడేవాడు.

ఆ ఒక్క బొమ్మంటేమాత్రం ఆమెకు అమితమైన యిష్టం. ఎంతవెల వచ్చినా ఆ బొమ్మమాత్రం అమ్మేదికాదు—అదే—....తన్ను కాటు వేయవస్తున్న పామునుచూస్తూ, ఆనందంతో, అమాయకంగా బోసినవ్వులు చిలికిస్తున్న పసిపాప బొమ్మ"

ఎందుకో! ఆ బొమ్మంటే ఆమెకు అంత ఆపేక్ష. మహీపతికి అర్థంకాలేదు.

—. . . . . . . . . . .—

చిక్కని హేమంత నిశీథి గుండెల్లో ఆ జీర్ణసత్రం అదమరచి నిదురలో గురకవేస్తూంది. మహీపతి మాత్రం—బీడీ మీద బీడీ కాలుస్తూ—కాలుగాలిన పిల్లిలా తిరుగుతూ—జ్యోతిష్మతికోసం నిరీక్షిస్తున్నాడు.

ఆ సత్రంలో వారిద్దరూ బసచేసి పదిరోజులుపైగా దాటింది. జ్యోతిష్మతి ఎన్నడూ యింత ఆలస్యం చేయలేదు. అయితే ఆమె మధ్యాహ్నంపూట బొమ్మలమ్మకానికి బయలుదేరి—ఏ రాత్రి పదింటికో చేరడం అంత అరుదైన విషయంకాదు. ఎటొచ్చీ యీరోజు మరీ ఆలస్యమైంది. అంతే......ఆమె ఆలస్యానికి కారణం ఎన్నడూ నిలదీసి అడగలేదు మహీపతి. జ్యోతిష్మతి అల్లరి చిల్లరగా, అడ్డమైన వాళ్ళతోనూ తిరుగుతూందని—కాస్త కట్టడి చేయమని—ఒక రిద్దరు చాల రోజుల క్రిందటే మహిపతికి సలహా యిచ్చారు. కాని మహీపతి వారి మాటలకు విలువ యిచ్చి అంతగా పట్టించుకోలేదు.

ఎందుకో! యీనాడు వారి మాటలు ఉన్నట్టుండి మహీపతికి జ్ఞప్తికివచ్చాయి. దేహంమీద తేళ్లు ప్రాకినట్లు బాధపడ్డాడు. ఫర్లాంగు దూరంలోఉన్న నగరంవైపు విసురుగా బయల్దేరాడు.

నిశీథి మూగగా విషాదగానం చేస్తూంది. కాలువ లేత రొమ్ముపై మంచు తెరలు తెరలుగా కురుస్తోంది.

కాలువగట్టుపై జోరుగా అడుగువేస్తున్న మహీపతి మఫ్లరు తీసి చెవులను కప్పి కట్టుకున్నాడు. దూరాన నగరం కనుపించటం లేదుగాని, ఏనాడో స్పందించడం మానుకున్న నగర హృదయం నుంచి నీలికాంతి లీలగా కనుపిస్తోంది. యింతలో కాస్త ముఖ పరిచయమున్న రిక్షావాలా, తన జీవితంలాగే అర్థంలేని పాట పాడుకుంటూ మహీపతికి ఎదురయ్యాడు. మహీపతి అతన్ని ఒక కుశలప్రశ్నవేసి "మా బొమ్మలమ్మి కనుపించిందా" అని అడిగాడు.

"ఆఁ—.....సన్యాసి టీ కొట్టుదగ్గర" ముక్తసరిగా అని కొంచెం సందేహిస్తూ—. . . .నువ్వక్కడకు యీ సమయంలో పోవడం అంతమంచిపనికాదు. . . . .రా. . . . .బండెక్కన్నా! సత్రంకాడ దించేస్తా". . . . . .అన్నాడు.

ఆ మాటలు ఏదో వ్యంగ్యంగా ధ్వనించినట్లయి మహీపతి బిగుసుకుపోయాడు.

"ఉ—హుఁ" అని గట్టిగా నిట్టూర్చి ముందుకే నడిచాడు.

సన్యాసి "టీ" కొట్టు, దగ్గరపడుతూన్నకొద్దీ అతని గుండెలు ఎందుకో జోరుగా కొట్టుకోసాగాయి. అనుకున్నదానికన్నా ముందుగానే టీ కొట్టుచేరి, తొంగిచూసేసరికల్లా, సన్యాసి, జ్యోతిష్మతి కొంగుపట్టుకుని లాగుతూ, సరసాలాడటం కనుపించింది.

భయంకరమైన అవమానం! చాచి లెంపకాయ కొట్టినట్లు యింది. పిచ్చివానిలా ఒక్కసారి గట్టిగా అరిచాడు. ఆ అరుపుకు జ్యోతి అదరిపడి—వెనుక ముందులు చూడకుండా రోడ్డు మీదకు పరుగెత్తుకొచ్చేసింది.

అంచులు దాటుతూన్న కోపాన్ని పెదిమలతోపట్టి ఆపు కుంటూ—"యిక—పద" అన్నట్లు చూశాడు.

చేసిన నేరానికి విచారిస్తున్న వ్యక్తి ఛాయలు లేకపోతే పోయె-కనీసం నేరం బయటపడినప్పుడయినా, నేరస్థులు పొందే సిగ్గు కూడా జ్యోతి ముఖంలో కనుపించకపోయేసరికి అతను కొంతతొట్రుపాటుపడ్డాడు.

నడుస్తున్నంతసేపూ ఆమె, ఆ రోజు బొమ్మలమ్మకం గూర్చిన వివరాలు ఎప్పటిలానే ఉల్లాసంగా, చేతులు తిప్పుకుంటూ చెప్తోంది. మహీపతి ఆమెను, ఎటూ అర్థం చేసుకోలేక తన్ను తాను తన్నుకుంటూ మౌనంగా నడుస్తున్నాడు.

ఎంతకూ, అతను మాట్లాడకపోయేసరికి, ఆమెకు విసుగొచ్చి—"ఏం. . . .యీవేళ నీకేం దయ్యంపట్టింది మూగ నోముపట్టావు?" అని కసిగా అన్నది. అయినా మహీపతి పెదవి కదపలేదు.

యిద్దరూ బసకు చేరుకున్నారు.

జ్యోతి—దీపం వెలిగించింది. చెదురుగానున్న సామాను సర్దింది.

"ఇంద ఇది తిని కాసిన్ని నీళ్ళు త్రాగు—ఒక్క నిముసంలో పొయ్యి రాజేస్తాను..." అంటూ మిఠాయి పొట్లం అందిచ్చింది.

మహీపతి పొట్లం అందుకుని బలంగా నేలను విసిరి కొట్టాడు. మిఠాయి గదినిండా చెల్లా చెదరయింది.

నిజంగానే యితనికేదో దయ్యంపట్టింది అని మనసులోనే అనుకున్నది జ్యోతిష్మతి.

యిక మహీపతి కోపం ఆపుకోలేకపోయాడు—.

"ఏమిటా అడ్డమైన వెధవలతోనూ ఆ—తిరుగుళ్ళు—యీసారి కనుపిస్తే చీరేస్తాను" అన్నాడు. ఆ మాటలకు జ్యోతి నిశ్చేష్టురాలవుతుందని అనుకున్నా డతను. కాని ఆ మాటలను ఆమె తేలిగ్గా తీసేస్తూ—

"సరేలే—యింత కాలానికి మొగాడివనిపించుకున్నావు—పట్టెడు తిండి తింటేనేకాని నీకోపం తగ్గేటట్టు లేదు" అని అంటూ పొయ్యి రాజెయ్యబోయింది.

దాంతో మహీపతికోపం మరీ రెచ్చిపోయింది. "నాకేం—అక్కర్లే— నీ నడతతోనే నా కడుపునిండిపోయింది" బిగ్గరగానే అరిచాడు.

అతని కనులలోని ఎఱ్ఱజీఱలు—కందగడ్డలా అయినా ముఖంచూసి "కోపంలో కూడా ఎంత అందంగా ఉంటాడు!" అనుకుంది. ఆమెలో మహీపతికోపం ఏమాత్రమూ భయాన్ని కలిగించలేదు. అలిగిన పసివాడినిచూచి తల్లికి కలిగిన జాలిలాంటిదేదో ఆమెలో కదిలింది. అంతే—.

"నేనుమాత్రం—ఏం చేశానని—ఆ సన్యాసి ముండాకొడుకు, కొంగుపట్టుకుని వదలకపోతే" అని అంటూనే అతన్ని చుట్టుకుపోబోయింది.

మహీపతి ఒక్కసారి దూరంగా నెట్టేశా డామెను.

ఆ రాత్రి యిక వంట ప్రసక్తిలేదు. యిద్దరూ ఎడమొగమూ, పెడమొగమై పడుకున్నారు.

యిద్దరూ పడుకున్నారేకాని, ఎవరికీ కునుకు పట్టలేదు. ఎవరి ఆలోచనలతో వారు సతమతమవసాగారు. చీకటిమాత్రం వారి ఆలోచనలకు కాపలా కాస్తూ కునుకుపాట్లు పడసాగింది.

పరిచయమైన ఆమె ప్రతీ కదలికా మహీపతి మనోయవనికపై పడి చలించసాగింది. ఎంతగా ప్రయత్నించినా, ఆమె మనస్తత్వం అవగతమయిందికాదు. కాని అందులో ఏదో—తెలియని లోతు ఉన్నట్లు మాత్రం లీలగా కనుపించింది.

జ్యోతిష్మతి ఏనాడూ తన తెలివితేటలమీద తను ఆధారపడలేదు. విధి—అదృష్టం—యీ రెండింటిపైన భారంవేసి నిశ్చింతగా జీవించడానికి అలవాటు పడింది. ఆమెలో కూడా స్త్రీగా ఏవో కొన్ని నిర్ణీతమైన ఆశయాలు లేకపోలేదు. జీవితపు తొలి అడుగుల్లోనే అవి విధి అడుగులక్రిందపడి నలిగిపోయాయి. నిజంగా యిది దురదృష్టం.

ఆ దురదృష్టమే ఆమె జీవిత పతనానికి దారితీసింది. యిలాంటివాళ్ళు దేశంలో లేకపోలేదు. సునిశితమైన విచక్షణ—అంతులేని అనురాగం— అవనికి మించిన క్షమ—అన్నీ ఉంటాయి. కాని ఏం లాభం? అన్నీ వృథాఅయిపోతునేఉంటాయి. తమ బలహీనతలు తెలిసి కూడా, సర్వనాశనం అవుతున్నామని గుర్తించి కూడా ఆ మార్గంనుంచి తప్పించుకునేందుకు, వీసమెత్తుకూడా ప్రయత్నించరు. అలానే—ఆ భయంకరమార్గాన్నే అనుసరిస్తూ, ఊహకందని విధంగా జీవితాన్ని అధిగమిస్తుంటారు.

ఎంత వింత ప్రకృతి!

ఆ భయంకరమార్గంలోనే ఎంతో జీవిత సత్యాన్ని, ఎనలేని ఆనందాన్ని మూటగట్టుకుంటున్నారు కాబోలు!

స్వార్థంలేని మంచితనం ఎక్కడా కనుపించదని—మనం అనుకోరాదు. అరుదుగా కనిపిస్తూనే ఉంటుంది. కాని మనం దాన్ని గమనించలేం.

జ్యోతిష్మతి తన స్వప్నయాత్రలోని వంపులను గురించి ఏనాడూ ఆలోచించదు. ఆమెలోమోసంలేదు; దాపరికం లేదు. అందాన్ని దాచుకోవాలనే ఆసక్తి అసలే లేదు. యాచించేవారికి అందివ్వడంలో—ముందు—వెనుకలు, నీతి, అవినీతుల ప్రసక్తే, లేదు. ఆమె మనసుకు విధి, నీలి తెరవేసి అరలు బిగించలేదు.

యిక ఆమె జ్ఞానా? అజ్ఞానా? ఎవరు చెప్పగలరు?

"ఆమె జ్ఞానే ఎందుకుకాదు? జ్ఞానానికి అవధి అంత కన్న ఏముంది కనుక—"

అని ఎవరేనా ఆమె తరఫున వకాల్తా తీసుకుని మనతో వాదిస్తే—నీతి—అవినీతి కొలబద్దతో ఆమె ఆంతర్యాన్ని వది లేసి, ఆమె చర్యలనుమాత్రం కొలిచేసి—"అజ్ఞాని" అని ఖచ్చి తంగా తేల్చిపారేస్తాం.. బాల్యంలోనూ, నిర్మలత్వంలోనూ, చప లత్వం తొంగిచూస్తూంది. యీామె రెండు పది సంవత్సరాల—పసి పాప—అంతే. . . . .అపవిత్రులంతా లోకాన్ని క్షమాభిక్ష అర్ధి స్తూనేఉంటారు. అయినా లోకం క్షమించదు—.అవినీతిని క్షమించ లేనినాడు నీతిని, దైవాన్ని కూడా ఆరాధించలేం.

* * *

పక్కకు తిరిగి ఆమెకేసి చూశాడు మహీపతి.

చీకటిని కప్పుకుని పడుకున్నట్లు కనుపించింది జ్యోతి ష్మతి. ఆమె తను తాళికట్టినభార్యకాదు. అయినా తనభార్య కాదని ఏనాడు మహీపతి భావించలేదు. వారిద్దరిని ఒక ముడిని బిగించినది. ఒకరి కింకొరిపైగల—జాలి—లేకపోతే గత జన్మ ఋణానుబంధం—అయిఉంటుంది.

ఆద్యంతాలులేని అమాయకురాలు—.యీామె అందాన్ని చూసి, ఓర్చుకోలేని దేవతలు—యిచ్చిన శాపం. లేకపోతే చక్కని తెలివితేటలుండి కూడా యిలా తప్పుదారిన పడుతూాందా! అంతే.... దేవతలు యిచ్చిన శాపం......అనుకున్నాడు చాలసార్లు—చీక టిలోఆమెనుచూస్తూ. అతనిలో కోపం పూర్తిగాతగ్గిపోయింది—. ఆ స్థానంలో పవిత్రమైన ఆలోచనలు తలలెత్తాయి. అతను ఆలో చనలో పడ్డాడు.

"గత అనుభవం వివేకాన్ని ప్రసాదించలేకపోయింది. జీవితానికొక రూపంలేదు—ప్రాణంలేదు. ఆమె తీరే అంత— ఆమె ననుకుని ఏం ప్రయోజనంలేదు. శూన్యమైన ఆమె జీవి తంలో ప్రాణంపోసి ఒక రూపకల్పన చేయాలి. భగవంతుడే ఆమెను క్షమిస్తాడు. వెలుగు చూపిస్తాడు; అక్కడే ఆమె ఆలోచనలన్నీ నిలచిపోయి, అన్వేషించటం ప్రారంభిస్తాయి; ఆమె జీవితం తిరిగి పునీతమవుతుంది—. . .అంతవరకు—. . . .ఆ శుభ సమ యం వరకు ఓర్మి వహించాలి" అనుకున్నాడు.

"ఏయ్" మెల్లిగా పిలిచాడు మహీపతి.

ఆ పిలుపుకోసమే ప్రాణాలు నిలబెట్టుకుని ఉన్న జ్యోతి ష్మతి అతనిదగ్గరగాజరిగి, అతని చేతిని తన చేతిలోకి తీసుకుంటూనే

"వదిలేసిపోతావా!" అని అన్నది.

ఊహించని ప్రశ్న ఎదురైనందుకు అతను కొంచెం చలిం చాడు. త్రుటికాలం ఆలోచించి "భగవంతుడు పిలచినా నిన్ను వదిలేసి వెళ్లను—జ్యోతీ!" అన్నాడు.

ఆ మాటకు ఆమె కళ్ళు ఒక్కసారిగా మెరిశాయి. లోకం లోని నిర్మలత్వం అంతా ఆమె కళ్లలో కనుపించినట్లుయిందతనికి. ఎనలేని నమ్మకం కలిగింది.

"అవునూ. . . . . .ఎందుకింత తెలివి తక్కువగా తిరుగు తావు?" ప్రతీ మాట మెల్లగా పట్టి పలుకుతూ అన్నాడు.

"నాకు—తెలియదు"

ఆ జవాబు వింటేనేకాని తాను ఎంత తెలివి తక్కువగా ప్రశ్నించాడో అర్థమయిందికాదు—మహీపతికి.

యింకా ఆమె చెప్పుకుపోతూనే ఉంది.

"అవును—.నిజంగా. . . . .నాకేమీ తెలీదు. నన్ను నా మనసూ—వయసూ—మోసం చేస్తున్నాయి. వాటికి తోడుగా— ఆ వెధవలంతా వెర్రెత్తిస్తున్నారు. నిలువరించుకోలేకపోతున్నాను" అన్నది.

యీ విషయం వివరించడానికి ఆమె వీసమంతైనా సిగ్గు పడలేదు; కనీసం నటించలేదు కూడా.

నిజమైనా, సిగ్గుపడాల్సిన విషయాన్ని ఎంత సంకోచ రహితంగా చెప్పగలిగింది—. . . . యింతకన్నా ఔన్నత్యానికి గుర్తు ఏముంది?

తెలియని సిగ్గు—మాయలేని వలపు—నీతికి అందని ఆంతర్యం—అన్నీ కలసి జ్యోతిష్మతి ఆకృతి పొందినట్లనిపిం చింది మహీపతికి.

తెల్లారి మహీపతి లేచేసరికల్లా—యింకా జ్యోతి నిదుర నుంచి లేవలేదు. పచ్చని చెట్లచాటునుంచి ప్రసరిస్తున్న లేత ఎండ పొరలో—గత రాత్రంతా వానకు తడిసి ఆరిన పచ్చని పువ్వులా నిదురపోతోంది.

అలా. . . . .అనిర్వచనీయమైన ఆ సౌందర్యాన్నిచూస్తూ కూర్చోవాలనుపించింది అతనికి. కాని యింతలోనే జ్యోతి లేస్తూ అతనినిచూసి నిర్మలంగా నవ్వింది. యిరువురి నవ్వులతో ఆ ప్రశాంత ప్రకృతి ఒక్కసారి గలగల లాడింది.

గతరాత్రి వారిరువురి నడుమ నడిచిన, విషాద స్మృతి చిహ్నాలు ముఖాల్లోనేకాదు—హృదయాల్లో కూడా కనుపించలేదు.

మూడు నెలలపాటు—అమరమైన క్షణాలను అందిస్తూ, కాలం తన ఋణాన్ని వారికి చెల్లించుకుంది.

......ఆనాడు విదియ వెన్నెల నేలపై పరచుకు పోతూంది. మంచినీళ్ల చెంబు మంచానికి ఎదురుగానున్న చిన్న స్టూలుమీద ఉంచి మహీపతి ప్రక్కగా కూర్చుంది జ్యోతిష్మతి.

యీనాడామెలో చిలిపితనం కనిపించటంలేదు. అంతే కాదు. నిండిన కోనేరులా, గంభీరంగా కనుపించసాగింది కూడా. కొంచెం పాలినట్లున్న బుగ్గలు, కళ్లకింద నల్లటి గీతలు— ఆమె మొఖంలో తొంగి చూస్తున్న అలసట—తృప్తితోపాటు, కాస్త పరీక్షగా చూసేసరికి మహీపతికి కనుపించాయి. యింటి పనులతోనూ, బొమ్మ లమ్మకంతోనూ—పాపం, అలసిపోతూంది' అనుకున్నాడు.

"ఒంట్లో బాగాలేదా" కాస్త ఆసక్తిగా ప్రశ్నించాడు.

"బాగానేవుంది" అన్నట్లు తలూపింది. అయినా ఆమె అలసట దాచుకోబడలేదు.

"చలాకీగా లేవేం—మరి"

ఆమెలో ఆమె నవ్వుకుంది.

"ఎందు కానవ్వు"

"నీకు అర్థం కాదులే"

"పోనీలే. . . .దాచేసుకో. . . .చెప్పవు కదూ" ప్రాధేయ పడ్డాడు మహీపతి.

జ్యోతిష్మతికి తెలుసు చివరకు అతనలా ప్రాధేయపడతాడని. ప్రాధేయపడితేకాని ఆమె పెదవి విప్పని సంగతి అతనికి కొత్త కూడా కాదు.

అట్టి-చిరుకోపాలు;—ప్రార్థనలు, కొసరింపులూ. . . . వారి జీవిత రాగ జలధిలో మధుర తరంగాలు. వెలలేని మలయ సమీరాలు.

"చూడండి!. . . . దొరగారూ. . . .తమరిక సిగరెట్ల జోరు కాస్త తగ్గించాలి" అన్నది.

"ఎప్పటినుంచి ఈ దురాచారం అమలు—.సొమ్ము ఆదా చెయ్యాలని దుర్బుద్ధి పుట్టిందా!" అన్నాడు ఆశ్చర్యం వ్యక్త పరుస్తూ మహీపతి.

"ఎల్లకాలం—మనిద్దరం పొడిగా ఉండిపోదాం....గా..." ముసిముసినవ్వులతోపాటు అన్నదామె.

"అంటే"

"ఛా. . . . .పో. . . . నీకు మరొకటి తెలిస్తేగా యిది తెలియడానికి" కళ్లు చక్రాల్లాచేసి తిప్పుతూ. . . .మహీపతికి తెలిసినది ఏదీ లేనట్లు అభినయించింది.

నిజానికి మహీపతికి ఏమీ తెలియక తికమకపడ్డాడు. అతని చెవి చెంతకు ఓరగాచేరి—ఒక చేయి అతని గుండెల కానించి రహస్యంగా—. . . ."పా. . . . .ప" అన్నది. అంటూనే సిగ్గు తెరల్లో మునిగిపోయింది.

ఆ రెండక్షరాల్లో ఎంత మధురిమ నిండిఉందో! మహీపతి ఒక్కసారి సంతోషంతో ఆమెను పట్టుకుని ఊపేశాడు.

ఉక్కిరిబిక్కిరయ్యాడు !

అప్పటికికాని అర్థమయిందికాదు ఆమె అలసటకు—తృప్తికి—గర్వానికి కారణం.

అవును—నిజంగా స్త్రీకి మాతృత్వంకన్న గర్వకారణం ఏమున్నది కనుక !

ఆ నిముషంలో లోకంలోని ఆనందమంతా వారి చెంత నిలబడిపోయింది.

"చూడమ్మీ . . . .ఎ. . . .న్నో. . . ." సగంలోనే ఆపేశాడు."

ఆమె—మురిసిపోతూ, మురిపిస్తూ, మూడువ్రేళ్ళ చూపించింది.

గుండె అంచులనుదాటి పొంగే ఆనందంతో—మహీపతి, పుట్టబోయేది—ఆడా. . . .మగా .... అని వితర్కించుకుంటూనే — తన ప్రతిరూపాన్ని చూసేందుకింకా ఎన్ని నెలలు ఓపిక పట్టాలో లెక్కేసుకున్నాడు. "జ్యోతీ! నువ్వేమనుకున్నాసరే—పుట్టబోయే పాపలో నారూపంతా అచ్చుగుద్దినట్లుండాలి—పోనీలే. . . .అంత రూపూ లేకపోతేపోయె—.నా ఉంగరాల జుత్తు. . . . .సూది ముక్కుమాత్రం తప్పనిసరిగా ఉండాలి. నా పోలికలులేని పాపనుకన్నావో. . . .నీ ముఖం చూసేదికూడా లేదు. . . . . .ఆఁ. . . .యిక నీయిష్టం" అంటూ పసివానిలా కేరింతలు కొట్టాడు మహీపతి ఎనలేని ఉత్సాహంతో.

ఆమె హృదయంలో ఒక్కసారి వెయ్యి మెరుపులు మెరిశాయి. కలుక్కుమంది అంతర్యం. అనంతకోటి గొంతుకలతో "నా పోలికలులేని పిల్లను కన్నావో నీ—ముఖం చూసేదిలేదు" అన్న మాటలు గుండెలో భయంకరంగా మారుమ్రోగాయి. ఒక్కసారి కుప్పలా కూలిపోయింది. ఒళ్లు చెమటతో తడిసిపోయింది.

పిచ్చి పట్టినట్లు పెనుగాలి రేగింది.

కొండల్లాంటి మబ్బులు ప్రశాంతమైన ఆకాశాన్ని జయించి ఆవరించుకున్నాయి.

తన స్థితి దాచుకునేందుకు తడబడుతూనే దీపం తగ్గించేసింది—జ్యోతిష్మతి.

మహీపతి మంచంమీదపడి—తీయని కలలో మునిగిపోయాడు.

ఆమెలో భయంకరమైన భావ సంఘర్షణ రేగింది. ఆ వేగానికి ఆమె ఊగిసలాడసాగింది. ఆ సంఘర్షణకు—లోకం సానుభూతిలేదు. మూగగా ఎవరినో అర్థిస్తూ కేకేసింది. దరిచేర లేని కేక తిరిగి ఆమె గుండెల్లోనే అణగారిపోయింది.

బిక్కు బిక్కుమంటూ వెలుగుతూన్న దీపం.

పైశాచిక నృత్యం చేస్తూన్న—నిశి.

యీదురుగాలి—సన్నని తుంపర.

అన్నీ కలసి—ఆ సమయాన్ని మరింత భీభత్సంగా మార్చాయి.

ఎన్నో సంవత్సరాల జీవితం గడిచిన తర్వాత—ఎన్నో అంకాలు ముగిసిన పిమ్మట—నీతికి, అవినీతికి, ధర్మానికి, అధర్మానికి—నడుమ, సన్నని రేఖపైన నిలబడి ఒక్కసారి గతాన్ని తొలిసారిగా చూసుకుంది.

తను పొందిన అనుభవాలు-అవమానాలు—సుఖం-దుఃఖం అన్నీ ఆమెముందు పరుగెత్తాయి. కదలిపోయింది—కంపించిపోయింది. అంతా శూన్యంగా అగుపించింది.

అమాయకంగా నిద్రపోతూన్న మహీపతిని లేపి-తన జీవితాన్నంతా అతనిముందు పరిచి— కన్నీటితో అతని పాదాలు కడిగి

తన పాపం క్షాళితం చేసుకోవాలనుకున్నది. . . .కాని చేయలేక పోయింది. ఏ దుష్టశక్తులో ఆమె శక్తిని అపహరించివేశాయి. యిక ఆమెకు శక్తి ఎక్కడిది?

ఆమె మదిలో ఒక చిన్న పువ్వు వికసించింది. కాని అది ఎవరికి అందీయను? ఏం చేసుకోను? ఆమెకు అర్థంకాలేదు. ఆ మాధుర్యానికి వివశురాలై పోయింది. వివశత్వంలోనుంచి భయంకరమైన మంటలు చెలరేగాయి. నాలుకలు చాచుకుంటూ ఆ—వహ్నికీలలకు ఆహుతికాక ఎలా ఆమె తప్పించుకోగలదు?

ఎన్నటికైనా అవినీతిని అణచి—నీతి వికసించక తప్పదు. నైతికమైన విలువలు గుర్తించిన తరువాత గత జీవితానికి—విచారించకుండా ఉండలేం.

జ్యోతిష్మతిలో—మాతృత్వం ఒక మహత్తరమైన పరిణామాన్ని తీసుకు వచ్చింది. దాదాపు నాస్తికుడు, ఆస్తికుడైనంత పరిణామం ఆమెలో కలిగింది. ఒక ఆ అమాయకమైన సంఘటన వద్ద పవిత్రత ఆవిష్కరింపబడింది. యింకా ఆమె గత జీవితాన్ని తలుచుకుని కృంగిపోకుండా ఎలా మనగలదు?

తన జీవిత గ్రంథంనుంచి, గత జీవిత పుటలను చించి పారేసి, నిశ్చిహ్నంగా చేసుకోవాలని గాఢంగా వాంఛించింది. కాని అది ఆమెకు సాధ్యపడలేదు.

ఆమెలోని దుఃఖం, ఆవేదన ఊహ కందని హద్దును దాటి పోయాయి. నిరామయమైన సమాధి స్థితికి వచ్చిందామె.

కన్నీరు ఆగిపోయింది.

వేదనాచ్ఛాయలు అంతరించాయి.

నిదురలో—కమ్మనికలలో విహరిస్తూన్న అమాయకుడైన మహీపతిని చూచి—నవ్వింది.

ఒరిగి పోతూన్న పూవును చూసి గాలి నవ్విన భయంకరమైన—నవ్వు.

భూకంపాన్ని తిలకించి—శూన్యాకాశం నవ్విన వింత నవ్వు — అది.

నిర్లిప్తంగా లేచి మృత్యువు లాంటి చీకటిలోకి దూసుకు పోయింది —. . . .

అంబరాన్ని, ఆకాశాన్ని — నీలికేశాలతో ఆచ్ఛాదిస్తున్న దయలేని నిశీథిలో — .. . . . ఒక అందమైన నీటిబిందువు అవనిలో యింకి పోయింది .

ప్రకృతి బరువుగా మూలిగి — పక్కకు ఒత్తిగిలింది. పాపం! పాముకాటు వేయబోతూన్నా — తెలిసికోలేక — నవ్వుతూన్న పసిపాప బొమ్మ మాత్రం మహీపతికి మిగిలి పోయింది — . . .

"టీ" కొట్టు రంగస్వామి — మిఠాయి సన్యాసి — కోవెల పూజారి . . —యింకా యిలా కొంతమంది ఆమె అందాన్ని అందుకుని , ఆమెజీవితంలోనుంచి నడచి పోయారు యిటీవలే. ఒక్క మహీపతిదే ముంది? వారిలో ఏ ఒకడైనా ఆమె మాతృత్వానికి కారణం కావచ్చు. ఆమెకు మాత్రం ఏం తెలుసు? — వీరిలో తన మాతృత్వానికి భాధ్యత ఎవరిదో!

అందుకే ఆమె ఎటూ తేల్చుకో లేక పోయింది. మహీపతి వలనకాక, యింకెవరి వలననైనా తనకు మాతృత్వం లభించి ఉంటే? . . . . . .

యిక ఆమె ఊహించ లేక పోయింది. తనకు ప్రతిరూపం కాని, తనకు బాధ్యతలేని— బిడ్డను — ఎలా ఆమె అతనికి అందించ గలదు? నైతికంగా అంత మోసంచేసే శక్తి ఆమెకు కరవయింది. అంతేకాదు. అమాయకమైన తనబిడ్డకు తండ్రి కాని మహీపతిని "తండ్రి" అనిచూపించి శాశ్వతంగా మోసం చేయగలగటం ఆమెకు చాతనయ్యే పనిగా కనుపించలేదు —. మహీపతి క్షమించినా ఆమె స్వీకరించలేదు. యీనాడు — ఆమె అంతర్యం మేలుకుంది— యుగయుగాల సంస్కారం పాటమమరించింది — అందుకే తను పవిత్రంగా ఆరాధిస్తూన్న మహీపతిని — తనకు జనించపోయే బ్రహ్మ స్వరూపుడైన పసి గుడ్డునూ . . . .మోసం చేయలేక. . . . మహీపతికి దూరమయింది.

యీ లోకపు మసగ కండ్లకు కనుపించని అనంతకోటి విషాద గాథలలో యిది ఒకటి.

ఆశలు — నిరాశలు, ఆవేదనలు — బలహీనతలూ, తృప్తి — అసంతృప్తి — వీటిలో చితికి పోయి చివికిపోయి — మట్టిలో కలసిపోయిన, మట్టిబొమ్మల విషాద గాథల్లో — మొదటిదీ — చివరదీ కాదు యిది. వాటిలో ఒకటి. అంతే— . . . .యింకా ఇలాటివి ఎన్నో!